క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మామడ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మామడ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు బీరువా అందజేత

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండాలోని ప్రాథమిక పాఠశాలకు మంగళవారం అదే గ్రామానికి చెందిన రాథోడ్ సాయినాథ్ రూ.10 వేల విలువైన బీరువాను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ అరవిందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం



నూతన కార్యవర్గం

కడెం: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ప్రియదర్శిని మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా గంట మంగ, కార్యదర్శిగా వెల్మల శ్యామల, కోశాధికారిగా నర్సింగ్ సులోచన, ఉపాధ్యక్షురాలిగా తిప్పని లక్ష్మి, సహాయ కార్యదర్శిగా ముస్కు రాజమణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం రాజేశ్వర్, సీబీఎం ఆడిటర్ దేవేందర్, ఏపీఎం రాజారాం తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 21 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం వైద్య శిబిరం నిర్వహిస్తామని.. దివ్యాంగులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూవన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిగా తహసీల్దార్



పాఠాలు బోధిస్తున్న తహసీల్దార్ శ్రీలత

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి, చింతల్‌చాంద, మునిపెల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీలత పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మునిపెల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆమె కాసేపు ఉపాధ్యాయురాలిగా మారి పాఠాలు బోధించారు. తెలుగుపై పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం తెలుగు భాషా సామర్థ్యాల పెంపునకు సూచనలు చేశారు. అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించండి'

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన గుర్రం రాజు ముదిరాజ్ యువకుడి మృతికి కారకులైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జి నారాయణ, ఆదిలాబాద్,నిర్మల్ జిల్లాల అధ్యక్షులు శివయ్య, బొండ్ల గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం న్యూసాంగ్వి గ్రామంలో రాజు కుటుంబీకులను పరామర్శించారు. మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి భూషి శైలజ, మామడ మండలాధ్యక్షుడు శేఖర్ తదితరులు ఉన్నారు.

'చలో కోరుట్ల' జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ప్రభుత్వం పద్మశాలీలను చిన్నచూపు చూస్తుందని.. ఈనెల 13న కోరుట్లలో నిర్వహించే సభకు తరలిరావాలని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణంలో చలో కోరుట్ల సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాబా ప్రాతిపదికన రాష్ట్రంలో పద్మశాలీలు రెండో స్థానంలో ఉన్నా.. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జె.ఆనంద్, రాజు, అల్వాల శ్రీనివాస్, బిల్ల శంకర్, నర్సయ్య, రవి, కిషన్, రాజేశ్వర్, గంగాధర్, భీమేశ్, సురేందర్, కిషన్, శంకర్ తదితరులున్నారు.

పట్టు పట్టారు..కొలువు కొట్టారు

- ఎస్సై ఉద్యోగాలు సాధించిన యువత
- పట్టుదల, సాధనతోనే సాధించామంటున్న విజేతలు
- యువత సమయం వృథా చేయొద్దని సూచన

పట్టుదలకు సాధన తోడైతే సాధించలేనిది ఏదీ లేదని వీరు నిరూపించారు. కుటుంబ పరిస్థితులు భిన్నంగా ఉన్నా.. లక్ష్యం చేరుకోవాలనే బలమైన ఆకాంక్షే వారిని విజేతలుగా నిలిపింది. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టి.. మైదానంలో చెమట చుక్కలు చిందించి విజయకేతనం ఎగురవేశారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్సై కొలువులు సాధించిన పలువురిపై కథనం..

ఆశయం పవిత్రంగా ఉండాలి.. సంకల్పం దృఢంగా ఉండాలి. ఈ రెండింటినీ ఆయుధంగా చేసుకొని ప్రణాళికతో ముందుకు సాగేవారు ఎప్పటికీ అపజయం పొందరు
– స్వామి వివేకానందుడు

ఆత్మవిశ్వాసంతోనే..

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన జాడె సుస్మిత సివిల్ ఎస్సైగా ఎంపికైంది. మీనాక్షి–నాందేవ్ దంపతులకు నాలుగో సంతానమైన సుస్మిత పాఠశాల విద్య, స్వగ్రామంలో.. ఇంటర్ బోధన్‌లో, డీఎడ్ ఆదిలాబాద్‌లో అనంతరం డిగ్రీ నిర్మల్‌లోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఓ వైపు ప్రిపరేషన్ సాగిస్తూ 2015 నుంచి నిగ్వాలో రేషన్ డీలర్‌గా పని చేశారు. 2019లో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. స్వగ్రామం నిగ్వా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. గ్రూప్–1 ఉద్యోగమే లక్ష్యంగా ప్రిపరేషన్ ప్రారంభించింది. అనంతరం ఎస్సై నోటిఫికేషన్ విడుదలవగా దరఖాస్తు చేసుకొంది. ఇంటి వద్ద ప్రిపరేషన్ సాగించింది. నలుగురం ఆడపిల్లలం అయినా తల్లిదండ్రులు ప్రోత్సహించారని తెలిపింది. తమను తక్కువగా భావించుకోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం తథ్యమని చెప్పింది ఈ విజేత.



తల్లిదండ్రులతో సుస్మిత

పోలీస్ ఉద్యోగంపై ఆసక్తితో..

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన తోట రమేశ్ అనే రిటైర్డ్ ఆర్మీ హవల్దార్ సివిల్ ఎస్సైగా ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తోట లస్మన్న–లస్మవ్వ దంపతుల కుమారుడు రమేశ్(37) ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలో.. పదో తరగతి ఆసిఫాబాద్ గురుకులంలో పూర్తి చేశాడు. ఇంటర్ అనంతరం 2004లో ఆర్మీకి ఎంపికై హవల్దార్‌గా విధుల్లో చేరారు. 2020లో రిటైరయ్యారు. ఆర్మీలో పని చేస్తుండగానే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశారు. పోలీస్ యూనిఫాంపై మమకారంతో ఎస్సై ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొని రెండున్నరేళ్లు అహర్నిశలు కష్టపడ్డాడు. 181 మార్కులు సాధించి ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో ఎస్సైగా ఎంపికయ్యాడు.



తోట రమేశ్

భర్త ప్రోత్సాహంతో..

కడెం: వివాహం..పిల్లలు కుటుంబ బాధ్యతలేవి లక్ష్యసాధనకు అడ్డు రావని నిరూపించింది ఈ వనిత. కడెం మండలంలోని మారుమూల ప్రాంతమైన గంగాపూర్‌కు చెందిన రమ ఎస్సై ఉద్యోగానికి ఎంపికైంది. ఇదే మండలంలోని అల్లంపల్లికి చెందిన ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి–మల్లవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు రమ అల్లంపల్లి జీయర్ గురుకులంలో పదో తరగతి, ఇంటర్ ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో, ఇంజినీరింగ్ నిజామాబాద్‌లో పూర్తి చేసింది. 2017లో గంగాపూర్‌కు చెందిన చిన్ని తిరుపతిరెడ్డితో వివాహమైంది. చదువుపై ఆసక్తిని చంపుకోలేక పోటీపరీక్షలకు ప్రిపరేషన్ ప్రారంభించింది. అప్పటికే వారికి ఏడాదిన్నర బాబు. గ్రూప్స్ కోచింగ్ తీసుకుంటానని చెప్పినా మొదట్లో కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. భార్య ఆసక్తిని గమనించిన భర్త తిరుపతిరెడ్డి ప్రోత్సహించాడు. దీంతో బాబును వదిలి 2022 మార్చిలో గ్రూప్స్ శిక్షణ కోసం హైదరాబాద్ వెళ్లింది. ఏప్రిల్‌లో ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ప్రణాళికతో ప్రిపేర్ అయి మొదటి ప్రయత్నంలోనే ఎస్సైగా ఎంపికైంది. అవాంతరాలు ఎదురైనా మధ్యలో వదిలిపెట్టకుండా ముందుకు సాగితేనే విజయం వస్తుందని రమ తెలిపింది.



రమ

కుటుంబసభ్యులే విజయానికి కారణం..

ముధోల్: ప్రణాళికకు పట్టుదల తోడైతే లక్ష్యం సాధించవచ్చని నిరూపించింది మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన జాదవ్ సువాసిని. వ్యవసాయ కుటుంబమైన జాదవ్ మాలిక్‌రావు–నీలాబాయి దంపతులకు రెండో సంతానం సుహాసిని. ఈమె స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, ఇచ్చోడ గిరిజన బాలికల పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి పూర్తి చేసింది. ఇంటర్ నిర్మల్‌లో, డిగ్రీ నిజామాబాద్ ఉమెన్స్ కాలేజీ, తెలంగాణ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసింది. ఎస్సై కావాలనే లక్ష్యంతో నిజామాబాద్‌లోని సెంట్రల్ లైబ్రరీలోనే ఎక్కువ సమయం గడిపింది. గతంలో కానిస్టేబుల్‌గా ఎంపికైనా ఉద్యోగానికి వెళ్లలేదు. ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో 240 మార్కులు సాధించి ఎస్సైగా ఎంపికైంది. చదువుతోపాటు నిద్రకు ప్రాధాన్యమిచ్చి.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఎస్సై ఉద్యోగం సాధించానని తెలిపింది. సక్సెస్‌కు షార్ట్‌కట్‌లు ఉండవని సమయం వృథా చేయకుండా కష్టపడటమే మార్గమని వివరించింది.



జాదవ్ సుహాసిని

యువకుల సేవలు గుర్తించండి

కడెం: ఇటీవల కడెం ప్రాజెక్ట్‌కు భారీ వరద వచ్చిన సమయంలో గేట్లను మాన్యువల్‌గా ఎత్తి కడెంను కాపాడిన యువకుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఏఐసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. మంగళవారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున యువకులను సత్కరించి అర్హులకు ప్రాజెక్ట్‌పై ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్, రఫీక్, సలీం, భూషణం, చాంద్‌పాష తదితరులు ఉన్నారు.

మీసేవ కేంద్రం నిర్వాహకుడిపై ఫిర్యాదు

పెంబి: మండల కేంద్రంలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ మంగళవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశారు. గిరిజనుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. మీ సేవా లాగిన్‌ను ఇతరులకు ఇస్తూ అతను కేంద్రానికి రావడం లేదన్నారు.

కుభీర్‌లో పరిష్కార వేదిక

కుభీర్: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. విద్యుత్ సంబంధ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అశోక్, ఈశ్వరయ్య, జీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎల్.కిషన్, రాజాగౌడ్, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీ ఆదిత్య, కల్లూరు ఏఈ శివప్రసాద్, కుభీర్ ఏఈ అజీజొద్దీన్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు ఆయన మేడిపల్లి మాజీ ఎంపీటీసీ ప్రవీణ్‌రెడ్డి, ఇతర నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అయ్యన్నగారి భూమయ్య, భూపతిరెడ్డి, సాదం అరవింద్, తోకల అనిల్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

- జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

సోన్: పరిశుభ్రత పాటిస్తేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని జెడ్పీటీసీ జీవన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు మందులు పంపిణీ చేశారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ వారంలో ఒకరోజు డ్రై డే నిర్వహించి.. ఇళ్లలో నిలవ్వనీటిని పారబోయించి చెత్తాచెదారం శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని పరిశీలించి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఎంపీఓ ఖలీల్ హైమద్, ఏపీఓ మంజులారెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, మెడికల్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది సంగీత, మమత, ఎల్లయ్య తదితరులున్నారు.

వానల్‌పాడ్‌లో...



మందులు అందిస్తున్న సుధీర్‌కుమార్, సిబ్బంది

భైంసారూరల్: ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఎంపీవో మోజం హుస్సేన్ అన్నారు. డ్రై డేలో భాగంగా మంగళవారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలోని వీధుల్లో ఆయన పర్యటించారు. వారి వెంట పలువురు అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతపై దృష్టి సారించాలి..

కుంటాల: పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ప్రత్యేకాధికారి మసార్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సూర్యాపూర్, కుంటాలలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీఓ రహీం, సర్పంచ్ సునీత, సమత, కార్యదర్శులు రాజు, రాజుబాపు తదితరులు పాల్గొన్నారు.

'కమీషన్ల కోసమే సంక్షేమ పథకాలు'

ఖానాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లు, బీసీ రుణాలు, దళితబంధు వంటి సంక్షేమ పథకాలు ఆ పార్టీ నేతలకు కమీషన్ల ద్వారా లబ్ధి చేకూర్చేందుకే ప్రవేశపెట్టారని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎంరావు ఫంక్షన్‌హాల్లో టీజేఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. వర్షాలతో నష్టపోయిన బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. పలు విషయాలపై తీర్మానాలు చేశారు. అంతకముందు గద్దర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సునీల్, సీదాం మారుతి, కుడిమెత ఆనంద్‌రావు, శత్రుశ్‌రావు, వినాయక్‌రావు, శ్రీనివాస్, దేవిదాస్, చిన్న, సతీశ్, రాము, జంగు, రాజు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తిలక్‌రావు

సంక్షిప్త వార్తలు

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

కుంటాల: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో మానవహారంగా ఏర్పడి మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సక్రపు గజేందర్, అమృతం, ఎం.వెంకట్రావు, నర్సయ్య, అమూల్య, పుష్పలత, జ్యోతి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సాగర్ కాలనీలో ఉన్న డవ్ వృద్ధాశ్రమంలో బీరెల్లి రామారావు మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి గంగాధర్, సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, అనంతస్వామి, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

సోన్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి గృహలక్ష్మి పథకానికి 90 దరఖాస్తులు వచ్చాయని.. ఒక్క మాదాపూర్‌లోనే 60 దరఖాస్తులు వచ్చాయని మంగళవారం ఎంపీడీఓ గడ్డం మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల పదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కుంటాలలో..

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లోని మంగళవారం 396 మంది లబ్ధిదారులు గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో దేవేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

లోకేశ్వరం: తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ మోతీరాంను మంగళవారం మండలంలోని రేషన్‌డీలర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు కొప్పెల సాయారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిప్రి గంగన్న, డీలర్లు మారుతి అప్ప, రవీందర్‌రావు, మురళీధర్‌రావు తదితరులున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన దివ్యాంగులు

సారంగాపూర్: మండలానికి బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ శ్రీదేవిని దివ్యాంగుల సంఘం మండల నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు సురేందర్, భోజన్న, పోతన్న, భోజన్న, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌కు సత్కారం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఓ బాలికకు (14) బాల్యవివాహం జరిగిన విషయం తెలిసిందే. సదరు బాలిక సర్పంచ్ కనీస్ ఫాతిమాను ఆశ్రయించి కాపాడాలని వేడుకోగా సర్పంచ్ పోలీసులు, అధికారులకు సమాచారమిచ్చింది. వారు వచ్చి బాలికను సఖీ కేంద్రానికి తరలించారు. బాలికను కాపాడినందుకు మంగళవారం సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కుంటాల: మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జమీల్ అహ్మద్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. మంగళవారం పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనీస్ ఫాతిమా, హెచ్ఎం సునీల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యోగేశ్, ఉపాధ్యాయుడు భోజన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందకు చేరిన జీపుజాత

లక్ష్మణచాంద: సంక్షేమ హాస్టళ్ల సంరక్షణకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి జీపుజాత మంగళవారం లక్ష్మణచాందకు చేరింది. మండల కేంద్రంలోని బాలుర వసతిగృహం, సహకార జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నవీన్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్, పరమేశ్వరం, సభ్యులు రుద్రప్రతాప్, ఉదయ్, సాయిచరణ్ పాల్గొన్నారు.

'మేరీ మిట్టి మేరా దేశ్'ను విజయవంతం చేయండి

లక్ష్మణచాంద: మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ మల్లికార్జున్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల కుటుంబాలను సన్మానించాలన్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించాలని నాయకులకు సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ రాజు, నాయిడి మురళీధర్, మండలాధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్, ప్రధాన కార్యదర్శి రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్, రాజూరా, చందునాయక్‌తండా, బావాపూర్(ఆర్), దాసునాయక్‌తండాల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు భుక్య జాన్సన్‌నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా గ్రామాల్లో పలువురిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అంతకుముందు సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేసి భీం విగ్రహానికి పూలమాలలు వేశారు. చిన్నం రవి, నిమ్యానాయక్, అమర్‌సింగ్, సరోజ, చిప్ప దేవన్న, బుచ్చాగౌడ్, మహేందర్, ప్రణీత్, సతీశ్ తదితరులున్నారు.

మహిళలకు చీరెలు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ పంచాయతీలోని గోండుగూడలో గిరిజన మహిళలకు మంగళవారం పెంబి జెడ్పీటీసీ జానుబాయి చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు తన పుట్టినరోజు పురస్కరించుకుని సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ నల్లూరి శ్రీధర్, ఉపేందర్, రంజిత్, గోపాల్‌రెడ్డి, వేణు తదితరులు ఉన్నారు.

గద్దర్‌కు నివాళులర్పించిన నేతలు

భైంసారూరల్: మండలంలోని హంపోలి గ్రామంలో మంగళవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిలా కార్యదర్శి రాజు మాట్లాడుతూ గద్దర్ కళాకారులకు, ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. దీనాజి, విఠల్, నర్సయ్య, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. షబ్బీర్‌పాషా, గోవింద్, రాజ్‌కుమార్, మున్వర్, ఆనంద్ ఉన్నారు.



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయండి

మామడ: ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించడంలో జాప్యం కారణంగా వరినారు ఎండిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ట్రాన్స్‌కో ఏఈ బాలయ్యకు పొన్కల్ రైతులు వినతిపత్రం అందించారు. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరాలో ఇబ్బందులేకుండా చూస్తామని ఏఈ తెలిపారు. రైతులు నర్సారెడ్డి, భూమన్న, ఎర్రోళ్లరెడ్డి తదితరులు ఉన్నారు.



మామడలో ట్రాన్స్‌కో ఏఈ బాలయ్యకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మీసేవ కేంద్రాల వద్ద భారీ రద్దీ



కడెంలోని మీ సేవ కేంద్రం వద్ద ప్రజలు

కడెం: ఈనెల 10లోగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు తరలిరావడంతో కడెంలోని మూడు మీ సేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు నిండిపోయాయి.



తానూరులో ధ్రువపత్రాల కోసం క్యూలైన్

తానూరు: మండలంలోని బెల్‌తరోడా, తానూరు, కోలూరు గ్రామాల్లోని మీసేవ కేంద్రాల వద్ద లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకునేందుకు పోటీపడ్డారు. మరోవైపు దరఖాస్తుదారులతో ఎంపీడీవో కార్యాలయం నిండిపోయింది.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేత

కుభీర్: మండలంలోని దుర్గానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ స్కూల్‌బ్యాగులు, పెన్నులు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తాను 2001లో ఇక్కడి పాఠశాలలోనే మొదట విధుల్లో చేరినట్లు గుర్తు చేసుకున్నారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా, ఇన్‌చార్జి డీపీవోగా పని చేశానన్నారు. ప్రస్తుతం ఆర్మూర్‌లో ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఈవో చంద్రకాంత్, కాంప్లెక్స్ హెచ్ఎం డి.సురేశ్, ప్రధానోపాధ్యాయుడు అరుణ్, పీఆర్టీయూ అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శి రాఘవేంద్ర, నర్మద తదితరులు ఉన్నారు.



కుభీర్ : విద్యార్థులతో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తన తండ్రి గంగారాం జ్ఞాపకార్థం ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ బ్యాగులు పంపిణీ చేశారు. సర్పంచ్ భోజాబాయి, దిగంబర పటేల్, హెచ్ఎం ఎల్లన్న, సారిక పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే)లో ఇటీవల రఘు గొంతు సంబంధిత ఆపరేషన్ చేసుకోగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు ఆయన ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం రఘుకు రూ.10 వేలు అందించారు. లక్ష్మణచాందలో అనారోగ్యంతో బాధపడుతున్న లక్కల పోసులుకు, రాజన్నకు రూ.ఐదు వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, ఒడ్నాల రాజేశ్వర్, సాయన్న, రమేశ్, రవి తదితరులు ఉన్నారు.



పొట్టపెల్లిలో శ్రీహరిరావు పరామర్శ